


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు




| శుక్రవారం 07 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :66 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## గోపాలపురం ప్రభుత్వ పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు

ఖమ్మం / తిరుమలాయపాలెం, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదుల సమస్యపై వెలువడిన కథనానికి స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెంటనే పాఠశాలను సందర్శించి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ పాఠశాల ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరతో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ దివాకర్ గురువారం పాఠశాలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు పాఠశాల అభివృద్ధిపై చొరవ చూపిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్త గదుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించి వెంటనే నిధులను విడుదల చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## యమునాపై రెండు కొత్త వంతెనలతో ఢిల్లీలో రవాణాకు మరింత వేగం

న్యూఢిల్లీ, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి ఢిల్లీలో రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా యమునా నదిపై రెండు కొత్త వంతెనల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఈ వంతెనలు అందుబాటులోకి వస్తే యుధిష్ఠిర్ సేతు, పాత ఇనుప వంతెనపై ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. దీంతో ఈశాన్య, ఆగ్నేయ ఢిల్లీ ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ప్రయాణ సమయం తగ్గి ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి రానుంది.

## ఆచార్య జయశంకర్, ప్రజాకవి గద్దర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళి





హైదరాబాద్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా, అలాగే ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆచార్య జయశంకర్, ప్రజాకవి గద్దర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పడంలో, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి దిశానిర్దేశం చేయడంలో ఆచార్య జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప విద్యావేత్త, మేధావి, ఉద్యమకారుడిగా ఆయనను అభివర్ణించారు. జయశంకర్ ఆశయాలు, విలువలు, నిబద్ధత నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాసేవ లక్ష్యాల సాధనలో ఆయన చూపిన మార్గం ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రజాకవి గద్దర్ సమాజ చైతన్యానికి, ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ముఖ్యమంత్రి అన్నారు.



## ఆధునిక సాంకేతికతతో చెత్త గుట్టల నిర్మూలనకు ఢిల్లీ ప్రభుత్వ చర్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి ఢిల్లీలోని చెత్త గుట్టలను పూర్తిగా తొలగించే లక్ష్యంతో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. 75 ట్రామెల్ యంత్రాలు, ఎయిర్ డెన్సిటీ సెపరేటర్లు, ఆధునిక ఎక్స్కవేటర్ల సహాయంతో ప్రతిరోజూ 25 వేల నుంచి 30 వేల మెట్రిక్ టన్నుల పాత చెత్తను శాస్త్రీయ పద్ధతిలో తొలగిస్తున్నారు. ఈ చర్యల ఫలితంగా ఓఖ్లా, భలస్వా ల్యాండ్‌ఫిల్ ప్రాంతాల్లో చెత్త గుట్టల ఎత్తు 30 నుంచి 40 మీటర్ల వరకు తగ్గగా, గాజీపూర్ ల్యాండ్‌ఫిల్‌లో 10 నుంచి 15 మీటర్ల మేర తగ్గినట్లు అధికారులు తెలిపారు. స్వచ్ఛమైన, అందమైన, మెరుగైన ఢిల్లీ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



## ఒకే వ్యవస్థలో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి రాష్ట్ర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలంటే రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, హెచ్‌ఎండీఏ పరిధిలో రోడ్ల విస్తరణ, నిర్మాణ పనుల పురోగతిపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న భూసేకరణ, రుణ సేకరణ, నిర్వహణ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఇతర రహదారుల అభివృద్ధి పనులన్నింటినీ సమన్వయంతో ఒకే వ్యవస్థ ద్వారా నిర్వహించాలని సూచించారు. ఓఆర్ఆర్ నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, రహదారిపై వాహనాల నిలుపుదలపై కఠిన చర్యలు తీసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు చేపట్టిన రేడియల్ రోడ్–1 పనులను డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, ఎదురయ్యే అడ్డంకులను వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. రహదారుల ఇరువైపులా పచ్చదనం పెంపొందించే చర్యలు తీసుకోవాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్, బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి రహదారి విస్తరణపైనే ఆధారపడి ఉందని పేర్కొంటూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని, టీడీఆర్‌ల జారీ ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## ఝార్ఖండ్ విద్యార్థి ఉద్యమంపై స్పందించకుండా ఢిల్లీలో యువ న్యాయం పేరుతో రాజకీయాలు: విమర్శలు



న్యూఢిల్లీ, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి ఢిల్లీలో యువతకు న్యాయం చేస్తామని ప్రకటిస్తూ రాజకీయాలు చేస్తున్న నాయకులు, ఝార్ఖండ్‌లో జరుగుతున్న విద్యార్థి ఉద్యమంపై మాత్రం మౌనం పాటిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు యువ న్యాయం పేరుతో ప్రకటనలు చేస్తూనే మరోవైపు విద్యార్థుల సమస్యలపై స్పందించకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.



## శ్రీశైలం జలాశయానికి ఉధృతంగా వరద.. 2.16 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు

శ్రీశైలం, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 2,16,764 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, జలాశయం నుంచి ఎలాంటి నీటి విడుదల (ఔట్‌ఫ్లో) చేపట్టడం లేదు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 871.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పరిస్థితిని నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వరద ప్రవాహం, నీటిమట్టాన్ని బట్టి అవసరమైతే నీటి విడుదలపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.




## చండీపూర్‌లో అగ్ని-4 విజయవంతం.. భారత్ వ్యూహాత్మక శక్తికి మరో మైలురాయి

చండీపూర్ (ఒడిశా), ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి ఒడిశాలోని చండీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి భారత్ గురువారం అగ్ని-4 మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రయోగంలో క్షిపణి నిర్దేశించిన అన్ని కార్యాచరణ, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. సుమారు 4,000 కిలోమీటర్ల పరిధి కలిగిన అగ్ని-4 క్షిపణి దేశ వ్యూహాత్మక నిరోధక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. ప్రయోగానికి ముందు భద్రతా చర్యల్లో భాగంగా 3,000 కిలోమీటర్లకు పైగా విస్తరించిన నోటామ్ (NOTAM) ఆంక్షలు అమలు చేసి పరీక్షా మార్గాన్ని పూర్తిగా సురక్షితం చేసినట్లు తెలిపారు. అగ్ని-4 విజయవంతమైన పరీక్షతో దేశ రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కావడంతో పాటు స్వదేశీ క్షిపణి సాంకేతికతలో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించినట్లు రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సైబర్ నేరాల నియంత్రణలో దేశంలో తెలంగాణకు ప్రథమ స్థానం

హైదరాబాద్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణలో రాష్ట్రాల పనితీరును కేంద్ర ప్రభుత్వం సమీక్షించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రం అత్యుత్తమ పనితీరు కనబరిచి మొదటి స్థానంలో నిలిచింది. సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారం, బాధితుల డబ్బు తిరిగి ఇప్పించడం, సైబర్ హాట్‌స్పాట్‌ల గుర్తింపు, దర్యాప్తు సామర్థ్యాల పెంపు, సైబర్ కమాండ్ అమలు వంటి పలు విభాగాల్లో తెలంగాణ విశేష ఫలితాలు సాధించినట్లు నివేదిక వెల్లడించింది. గ్రీవెన్స్ రెడ్రెసల్ మాడ్యూల్ (GRM), మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (MRM), సహయోగ్ పోర్టల్, సమన్వయ పోర్టల్ వంటి కేంద్ర హోంశాఖ రూపొందించిన డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగించి సైబర్ నేరాల దర్యాప్తు, ఫిర్యాదుల పరిష్కారం, మోసపోయిన నగదు రికవరీ ప్రక్రియలను వేగవంతం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించడం, వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చట్ట అమలు సంస్థల మధ్య సమన్వయంతో బాధితుల నగదును తిరిగి అందించే ప్రక్రియలో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరిచిందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతికత ఆధారిత చర్యలను మరింత విస్తృతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ

హైదరాబాద్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అదే రోజు సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారని, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒకేసారి అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు మొత్తం 1.05 కోట్ల కొత్త తెల్ల రేషన్ కార్డులు అందజేయనున్నామని, పేదల ఆహార భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.



## సచివాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలో శాంతి, సుభిక్షం, అభివృద్ధి మరింత వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



## వెంకట్రాంపురం డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి.. గ్రామస్థుల డిమాండ్

అనంతగిరి, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి అనంతగిరి మండలం వెంకట్రాంపురం గ్రామ శివారులో కేవలం అర కిలోమీటర్ దూరంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కారణంగా గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ మున్సిపాలిటీ నుంచి సాధారణ చెత్తతో పాటు ఆస్పత్రుల వ్యర్థాలు, చనిపోయిన పశువుల కళేబరాలను ప్రతిరోజూ వందలాది వాహనాల ద్వారా ఈ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని, వాటిని తగలబెట్టడం వల్ల తీవ్రమైన పొగ, దుర్వాసన వ్యాపించి వెంకట్రాంపురం గ్రామంతో పాటు సమీప గ్రామాల ప్రజలు విషజ్వరాలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే దట్టమైన పొగ కారణంగా కోదాడ–త్రిపురారం రహదారిపై వాహనదారులకు దారి సరిగా కనిపించక పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు పేర్కొన్నారు. అలాగే చనిపోయిన పశువుల కళేబరాలను కుక్కలు ఈడ్చుకెళ్లి ప్రజలపై దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే డంపింగ్ యార్డును గ్రామానికి దూరంగా తరలించాలని, లేనిపక్షంలో గ్రామాన్ని విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజారోగ్యాన్ని కాపాడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.



# నిద్రపోతున్న మూడో కన్ను.. గ్రామంలో నిర్వీర్యమైన సీసీ కెమెరాలు

అనంతగిరి, ఆగస్టు 7 సందేశం టైమ్స్ ప్రతినిధి అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలో దాతల సహకారంతో సుమారు రెండేళ్ల క్రితం రూ.2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం నిర్వీర్యంగా మారడంతో గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కెమెరాలు ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే అవి పనిచేయకుండా పోవడంతో గ్రామపంచాయతీ వద్ద ఉన్న పరికరాలు, బాక్సులు కరెంటు స్తంభాలపై నిరుపయోగంగా మిగిలిపోయాయని తెలిపారు. పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామంలోని చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల బాక్సులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్ల గ్రామంలో పలు అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నాయని, మహాత్మాగాంధీ, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, పార్టీ జెండాలు, దిమ్మలు ధ్వంసమైన ఘటనలతో పాటు రామాలయంలో హుండీ పగులగొట్టి నగదు చోరీ చేయడం, చెరువు వాటర్‌ట్యాంక్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్లు అపహరించడం, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్ బాక్సులు దొంగిలించడం వంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవించి గ్రామ వీధుల్లో వీరంగం సృష్టించడం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి మద్యం సేవించి సీసాలు పగులగొట్టడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. గ్రామ భద్రత దృష్ట్యా వెంటనే సీసీ కెమెరాలను మరమ్మతులు చేసి తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, పోలీసు శాఖ, సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిగా ప్రజాసేవ చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కులు, నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజలకే దక్కాలనే లక్ష్యంతో ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం ఉద్యమించారని, ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతాయుతంగా ప్రజలకు సేవ చేయాలని, అభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా సమిష్టిగా కృషి చేయాలని, సూర్యాపేట జిల్లాను రాష్ట్రంతో పాటు దేశంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు బృందంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ మాట్లాడుతూ మలి తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర చారిత్రాత్మకమని, తెలంగాణ వనరులు తెలంగాణ ప్రజలకే దక్కాలనే లక్ష్యంతో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ప్రేమ్‌రాజ్, సీపీవో కిషన్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీపీవో యాదగిరి, డీడబ్ల్యూవో నరసింహారావు, డీటీవో రవికుమార్, ఇన్‌చార్జి పరిపాలనాధికారి శ్రీలతతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పుల్లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. జూలై 24తో ముగియాల్సిన బీఎల్‌వోల ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియతో పాటు సేకరించిన వివరాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తయిందని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండటం, మరణించిన వారి పేర్లు కొనసాగడం వంటి లోపాలు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎల్‌వోలు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధ్రువీకరించాలని, 2026 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, సి సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన సీహెచ్ రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు చల్లమల్ల నరసింహ, ఎండి హాబిద్, బీఎస్పీకి చెందిన ఎం. స్టాలిన్, బీఆర్ఎస్ నాయకుడు కరుణాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీకి చెందిన డి. రమేష్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఆచార్య జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించిన తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది

అనంతగిరి, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి అనంతగిరి మండల తహశీల్దార్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మేధావి, తెలంగాణ భావజాల పితామహుడు ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కమలాకర్ ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు రూపమిచ్చిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడుతూ, నీరు–నిధులు–నియామకాల నినాదంతో తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని సిబ్బందికి సూచించారు. ఆచార్య జయశంకర్ బోధనలు, రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట నగేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులాల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, కళాశాలల్లో 2026–27 విద్యాసంవత్సరానికి తాత్కాలిక పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి తెలిపారు. డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, పీజీటీలు, టీజీటీలు, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెండు జిరాక్స్ సెట్లతో ఆగస్టు 11 ఉదయం 9 గంటలకు రాజేంద్రనగర్‌లోని ప్రాంతీయ సమన్వయ కార్యాలయంలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. బాలికల విద్యాలయాల్లో మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

# యూపీఎస్సీ ఉచిత కోచింగ్ దరఖాస్తుకు నేడు చివరి అవకాశం

సంగారెడ్డి, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 (ప్రిలిమ్స్-కమ్-మెయిన్స్) ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి నేడు (ఆగస్టు 7) చివరి తేదీ అని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. జగదీష్ తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు ప్రవేశం కల్పించనున్నట్లు, అందులో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయగా, గతంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన 50 మంది అర్హులకు స్క్రీనింగ్ పరీక్ష లేకుండానే నేరుగా ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.5,000 స్టైపెండ్, ఒకసారి రూ.5,000 పుస్తక నిధి, గ్రంథాలయ సౌకర్యం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, సబ్జెక్ట్‌వారీ పరీక్షలు, మూల్యాంకనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండడం, ఉద్యోగంలో లేకపోవడం, ఇతర కోర్సులు అభ్యసించకపోవడం, ఇతర ప్రభుత్వ శాఖల ఉచిత కోచింగ్ పొందకపోవడం వంటి అర్హతలు ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంత అభ్యర్థులది రూ.2 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఆగస్టు 13 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఆగస్టు 16న స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి ధృవపత్రాల పరిశీలన, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అర్హులైన సంగారెడ్డి జిల్లా అభ్యర్థులు నేడు (ఆగస్టు 7)లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని లేదా 08455-277015, 9494390803 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేడు హ్యాండ్లూమ్ వాక్ ర్యాలీ

సంగారెడ్డి, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు హ్యాండ్లూమ్ వాక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి తెలిపారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రారంభించనుండగా, చేనేత రంగ ప్రాధాన్యత, చేనేత కార్మికుల సేవలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. మీడియా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై విస్తృతంగా కవరేజ్ అందించాలని జిల్లా పౌర సంబంధాల అధికారి కోరారు.




## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర సాధనను జీవిత లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించి, తెలంగాణ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని చారిత్రక, సామాజిక, ఆర్థిక కోణాల్లో ప్రపంచానికి వివరించిన దార్శనికుడు జయశంకర్ అని కొనియాడారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా ఆయన చేసిన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహా మేధావి అని, ఆయన రచనలు, పరిశోధనలు, ఉపన్యాసాలు ఉద్యమానికి అపారమైన మేధోబలాన్ని అందించాయని తెలిపారు. అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ జయశంకర్ చూపిన విలువలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.




## కేజీబీవీ కొండాపూర్‌లో బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన – 3 వేల శానిటరీ ప్యాడ్ల పంపిణీ

కొండాపూర్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి శానిటరీ ప్యాడ్ బ్యాంకు కింద 3 వేల శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కె. లలిత కుమారి మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన శానిటరీ ప్యాడ్లను వినియోగించి నిర్ణీత వ్యవధిలో మార్చుకోవడం ద్వారా అనేక రకాల ఇన్ఫెక్షన్లను నివారించవచ్చని తెలిపారు. రుతుక్రమం ప్రతి బాలిక జీవితంలో సహజమైన ప్రక్రియ అని, దీనిపై ఎలాంటి అపోహలు లేదా భయాలు అవసరం లేదని పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి లలితాదేవి మాట్లాడుతూ యుక్తవయస్సు బాలికలు రక్తహీనతకు గురికాకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్, ప్రోటీన్లు, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉండే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ల సరైన వినియోగం, భద్రపరిచే విధానం, వినియోగం అనంతరం పరిశుభ్రంగా పారవేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ, ఎస్ఓ కవిత, ఎంపీడీఓ, ఎంఈఓ, సర్పంచ్, పోలీసు శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



## అందోల్–జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు

సంగారెడ్డి / అందోల్–జోగిపేట, ఆగస్టు 07 సందేశం టైమ్స్ అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు సంగారెడ్డి జిల్లా అందోల్–జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించి ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు రామకృష్ణ, నేనావత్ మేఘరాణి, నాగారత్నం గౌడ్, జ్యోతి, ప్రదీప్ గౌడ్, మంజుల, శ్రీకాంత్, రేఖ ప్రవీణ్, శోభ నారాయణ గౌడ్, శశిరేఖ అనిల్, కో-ఆప్షన్ సభ్యులు ముంతాజ్ బేగం, అక్బర్, జీషన్, టీపీవో నిహాల్ రెడ్డి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా బాటలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



నర్సాపూర్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి వి. సాయి నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి విద్యుత్ సరఫరా, నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఈ బాలస్వామి, ఎస్సీ నారాయణ, డీఈ స్వామి, ఏడీఈ రాఘవేంద్ర, ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## నాగులపల్లి పాఠశాలలో ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

నర్సాపూర్, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ప్రతినిధి వి. సాయి నర్సాపూర్ మండలం నాగులపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ ఉద్యమ భావజాల పితామహుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. ఆయన ఆశయాలు, భావజాలం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, విద్యార్థులు సమాజ సేవా భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మాజీ విద్యావలంటీర్ కొమ్ము రమేష్‌బాబు మృతి - శిష్యులు, గ్రామస్థుల నివాళి



ఖమ్మం / చింతకాని, ఆగస్టు 07 సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్ చింతకాని మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన మాజీ విద్యావలంటీర్ కొమ్ము రమేష్‌బాబు అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు సంవత్సరాల పాటు విద్యావలంటీర్‌గా సేవలందించి ఎందరో విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఆయన వద్ద విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు నిర్వహిస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా రమేష్‌బాబును పలువురు కొనియాడారు. ఆయన మృతి పట్ల విద్యుత్ శాఖ ఖమ్మం రూరల్ ఏఈ (టెక్నికల్) రజియా, మహబూబాబాద్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నర్సింగ్ ఆఫీసర్ రేబల్లి జ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం పంచాయతీరాజ్ ఏఈఈ మొండితోక నవీన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు, ఉపసర్పంచ్ బుచ్చిబాబు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు షేక్ మధార్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బద్రి కాశి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోదా మంగయ్య, గ్రామ పెద్దలు నంజాల అప్పారావు, కంచుమర్తి నరేష్‌బాబు, పోటు నాగేశ్వరరావు, బద్రి నాగేశ్వరరావు, తెల్లబోయిన గోపి తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం: ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి, అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, సిద్ధాంతాలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, సీఐలు సందీప్ రెడ్డి, జర్జ్, ఆర్ఐ శైలేందర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.



# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

రామచంద్రపురం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 7: రామచంద్రపురం పట్టణంలోని భారతి నగర్ డివిజన్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 111వ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మండల అధ్యక్షుడు మహమ్మద్ అబూ అలీ ఖురేషి, పటాన్‌చెరు ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పరమేష్ యాదవ్, మహమ్మద్ అజిముద్దీన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన కీలక పాత్రను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# ఆచార్య జయశంకర్, గద్దర్‌లకు ఘన నివాళులు అర్పించిన ప్రజా సంఘాల నాయకులు

జోగిపేట, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి, ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా జోగిపేట పట్టణంలో ప్రజా సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు ఇరువురికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, మాల మహానాడు నాయకుడు మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన మార్గనిర్దేశం చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అలాగే ప్రజా సమస్యలను తన గళం ద్వారా ప్రపంచానికి తెలియజేసి, ఎన్నో గేయాలతో ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల కోసం ఇద్దరు మహనీయులు చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార్ శ్రీధర్, దాసరి దుర్గయ్య, మన్నె పరిపూర్ణ, రఫీక్, నటికే, పల్లె వెంకట రమణ, వేణుగోపాల్, ఎర్రోళ్ల నర్సింలు, సంజీవులు, ప్రజా సంఘాల నాయకులు దీనబంధు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# లక్ష్య సాధనకు కృషి చేస్తే విజయ శిఖరాలు చేరుకోవచ్చు: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ సూచించారు. మెదక్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించిన మొక్కల పెంపకం కార్యక్రమంలో ఆయన పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ జీవితంలో విజయాన్ని సాధించేందుకు ప్రతిభతో పాటు సమయపాలన, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థి దశలో అలవర్చుకునే మంచి అలవాట్లు భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని, ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని అందుకు అవసరమైన విద్య, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, అనవసర వీడియోలతో సమయాన్ని వృథా చేయకుండా చదువు, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. మొబైల్ వ్యసనానికి దూరంగా ఉంటే భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందని పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యం, చదువు, భవిష్యత్తును నాశనం చేస్తుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, ఎస్ఐలు నారాయణ, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెంచాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



పెద్ద శంకరంపేట, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: పారదర్శక రెవెన్యూ పాలన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం పెద్ద శంకరంపేట మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందించే రెవెన్యూ సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను కూడా పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాలలోని వంటశాల, తాగునీటి సౌకర్యాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న విద్య, వసతి, భోజనం, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కేజీబీవీలను పరిశుభ్రతకు నిలయాలుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని సకాలంలో అందించాలని ఆదేశించారు. అనంతరం బుజ్రాన్‌పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటిన కలెక్టర్, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి చేపట్టిన పనులను పరిశీలించిన ఆమె, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని, వాటి ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారుల సొంతింటి కలను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతి కుమార్, కస్తూర్బా గాంధీ విద్యాలయ ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలి: డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్

మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసిన ఆయన ఆలోచనలు, భావజాలం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఉపేందర్, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఆచార్య జయశంకర్ సేవలు అందరికీ ఆదర్శప్రాయం: కలెక్టర్ ప్రతిమా సింగ్

పెద్ద శంకరంపేట, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా పెద్ద శంకరంపేట తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అందరికీ ఆదర్శప్రాయులని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి, అందించిన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతి కుమార్, ఆర్ఐ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు.




## మీర్జాపూర్(బి)లో క్రైస్తవ పాస్టర్లకు సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

మీర్జాపూర్(బి), సందేశం టైమ్స్ న్యాల్కల్ మండల ప్రతినిధి, ఆగస్టు 7: న్యాల్కల్ మండలంలోని మీర్జాపూర్(బి) గ్రామంలో జహీరాబాద్ నియోజకవర్గ క్రైస్తవ పాస్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ అస్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైనారిటీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ పాస్టర్ల సమన్వయకర్తగా ఎన్నికైన అస్మాను ఘనంగా సన్మానించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అస్మా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హులైన పేదలకు రుణ సదుపాయాలు, ప్రార్థనా మందిరాల అభివృద్ధి, ప్రహరీ గోడల నిర్మాణం, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో పాస్టర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ మెథడిస్ట్ చర్చ్ జిల్లా అధికారులు రెవరెండ్ ఎం.ఎస్. సుదర్శన్, జిల్లా కార్యదర్శులు వై. రవి, సతీష్, ఇండిపెండెంట్ పాస్టర్ల అధ్యక్షుడు రమేష్ బాబు, నియోజకవర్గానికి చెందిన రెవరెండ్లు, పాస్టర్లు, సెల్ఫ్ అసిస్టెంట్ పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు.. పట్టించుకునే వారే లేరా?



నర్సాపూర్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్డీఓ కార్యాలయం పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ట్యాంక్ నుంచి నీరు బయటకు ప్రవహిస్తూ వృథా అవుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకవైపు నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ, మరోవైపు ప్రభుత్వ తాగునీరు వృథాగా పోతుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నీటి పొదుపుపై అధికారులు చెబుతున్న మాటలు ఆచరణలో కనిపించడం లేదని, వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు ముందుగా ప్రభుత్వ నీటి వనరుల పరిరక్షణపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## వట్టిపల్లిలో గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



వట్టిపల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి సీహెచ్ బస్వరాజు, ఆగస్టు 7: ప్రజా యుద్ధ నౌక, ప్రజా గాయకుడు గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా వట్టిపల్లి మండల కేంద్రంలో స్మారక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గద్దర్ యువ గళం అధ్యక్షుడు గొర్రెకల్ దాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తన పాటల ద్వారా చైతన్యం కలిగించిన గద్దర్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం, ప్రజల గొంతుకగా నిలిచిన ఆయన ఆశయాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. గద్దర్ చూపిన మార్గంలో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జనార్ధన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, అశోక్ గౌడ్, మారుతిరావు, ఎర్రోళ్ల నర్సింలు, శ్రీనివాస్, సాయిలు, పోతుల బొగుడ శోభన్, పల్లె విఠల్రావు, బోయిని శేఖర్, మచ్చికూరి సుఖేందర్, శ్యామయ్య, దత్తు తదితరులు పాల్గొని గద్దర్‌కు ఘన నివాళులు అర్పించారు.

## పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య



రంగంపేట, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి చెందిన వేముల కుమార్ (29) కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా ఉంటున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వివాహం జరగకపోవడం, మద్య వ్యసనం కారణంగా అతను తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు పేర్కొన్నారు. బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం తన గదిలో నిద్రించిన కుమార్, గురువారం ఉదయం ఇంటి ముందరి గదిలో సీలింగ్‌కు నైలాన్ చీరతో ఉరివేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు గమనించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి అన్న వేముల లక్ష్మీనారాయణ కొల్చారం పోలీసులకు ఫిర్యాదు చేస్తూ తన తమ్ముడు వివాహం జరగకపోవడం, మద్యానికి అలవాటు పడటం వల్ల తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం: ఎస్పీ నరసింహ

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 7: తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో, ఉద్యమానికి సిద్ధాంతపరమైన మార్గనిర్దేశం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మగ్దుం అలీ, ఆర్ఐ జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, రాజశేఖర్, సాయిరాం, అన్వర్, అశోక్, సీసీ సందీప్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు.



# జయశంకర్ స్ఫూర్తితో తెలంగాణ నిర్మాణానికి ముందుకు సాగాలి: టీజేఎస్ నాయకులు

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 7: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తితో తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు కిరణ్ కుమార్, కుంచం చంద్రకాంత్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి, అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జయశంకర్ ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్టల మురళి, రమేష్ రాజు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పించారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్, ఆగస్టు 7: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ఆయన ఆశయాలను భావితరాలకు చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. జయశంకర్ ఆలోచనలు, సిద్ధాంతాలు తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కొత్తపల్లి శ్రీకాంత్, దశరథ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, నాయకులు విఠల్, రామగౌడ్, అజీమ్, వాజిద్, రవి, లతీఫ్, అఖిల్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# నేరడిగుంటలో గద్దర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



నేరడిగుంట, సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి, ఆగస్టు 7: తెలంగాణ ప్రజా యుద్ధ నౌక, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా అందోల్ మండలం నేరడిగుంట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మన్నె పరిపూర్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దర్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ప్రజా సమస్యలను తన గళం ద్వారా ప్రపంచానికి తెలియజేస్తూ ఎన్నో గేయాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు గద్దర్ అని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు ఎప్పటికీ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని గద్దర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# ఆటో బ్యాటరీ చోరీ కేసును ఛేదించిన జోగిపేట పోలీసులు.. నలుగురు నిందితుల అరెస్ట్



జోగిపేట, సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: ఆటో బ్యాటరీ చోరీ కేసును జోగిపేట పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జోగిపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 193/2026, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 331(4), 305 కింద కేసు నమోదు కాగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 4వ తేదీ రాత్రి అందోల్ మండలం దాకూర్ గ్రామానికి చెందిన పశువుల షెడ్ ప్రహరీ గేటు తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించిన నిందితులు అక్కడ నిలిపి ఉంచిన TS-07-UA-7236 నంబర్ గల ఆటోను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆటోను తరలించడం సాధ్యం కాకపోవడంతో అందులో ఉన్న సుమారు రూ.5 వేల విలువైన బ్యాటరీని చోరీ చేసి పరారయ్యారు. బాధితుడు షేక్ మహబూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో 6వ తేదీ తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఎస్ఐ గిరి శ్రీకాంత్, పీసీ అరవింద్ రాథోడ్, హెచ్‌జీ సురేష్‌లు తలేల్మ గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేశారు. ఆటో నంబర్ ప్లేట్లను గుర్తుపట్టకుండా ఉండేందుకు బురద పూసినట్లు గుర్తించిన పోలీసులు అందులో ఉన్న నలుగురిని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారు. అరెస్టు చేసిన నిందితుల్లో మహమ్మద్ గౌస్ పాషా (అంబర్‌పేట్, హైదరాబాద్), మహమ్మద్ షఫీ అహ్మద్ (ఫలక్‌నుమా, హైదరాబాద్), మహమ్మద్ జమీలుద్దీన్ (రంజోల్ గ్రామం, జహీరాబాద్ మండలం), బాగ్లీ మైనోద్దీన్ (భూత్‌కూర్ గ్రామం, వట్‌పల్లి మండలం) ఉన్నారు. నిందితుల నుంచి చోరీకి గురైన ఆటో బ్యాటరీ, ఇనుప రాడ్డు, స్క్రూడ్రైవర్, నేరానికి ఉపయోగించిన ఆటో, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో A-1, A-3, A-4 నిందితులు గతంలో హైదరాబాద్, సైబరాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో పలు ఆస్తి నేరాలకు పాల్పడినట్లు, వీరు పాత నేరస్థులుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు జోగిపేట సీఐ అనిల్ కుమార్ వెల్లడించారు.



# ఆత్మహత్యాయత్నం చేసిన నిరుద్యోగి వేణుకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ.. రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేత

ముదిగొండ, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 7: నిరుద్యోగ సమస్యలు, కుటుంబ పరిస్థితులతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం వేణును బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి అండగా నిలిచారు. ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం భద్రయ్య కుమారుడు గడ్డం వేణు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల కాకపోవడం, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు సాధించలేకపోవడం, కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటంతో తీవ్ర మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి లేఖ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్ రాజు కుటుంబానికి అండగా నిలిచి పరామర్శించారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆసుపత్రి చికిత్స ఖర్చులను భరించగా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని మాజీ జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సలీమున్నిసా బేగం, వైస్ సర్పంచ్ రమాదేవి, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు వాచ్చేపల్లి లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి గడ్డ వెంకటేశ్వర్లు గౌడ్, మండల నాయకులు మచ్చ సీతారామయ్య, పాము సిల్వరాజు, ఏలూరి రమేష్, ధనియాకుల వీరస్వామి, గురుమూర్తి, కోటేష్ యాదవ్, కొమ్మూరి రమేష్, సంజీవరెడ్డి, నరసింహారావు, మడికంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అనుచరులు నాలాబాల హరీష్, పాలంచ రాజేష్, కొత్తగూడెం కార్పొరేటర్ తదితరులు హాజరయ్యారు. గ్రామ కమిటీ తరఫున ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## బోనకల్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి.. గుర్తింపు కోసం పోలీసుల విజ్ఞప్తి



బోనకల్, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 7: చింతకాని–బోనకల్ రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 6వ తేదీ ఉదయం 9.50 గంటలకు చింతకాని–బోనకల్ రైల్వేస్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 501/2 వద్ద దిగువ లైన్ ట్రాక్‌పై వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద గుర్తు తెలియని పురుషుడు పడినట్లు లోకో పైలట్ సమాచారం అందించారు. మృతుడి వయస్సు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని, ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహం తీవ్రంగా దెబ్బతినడంతో ముఖం గుర్తించేందుకు వీలు లేకుండా ఉందని పేర్కొన్నారు. మృతుడి ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామన ఛాయ కలిగి ఉన్నాడని, సంఘటన స్థలం సమీపంలో ఎలక్ట్రికల్ బాక్స్ గద్దెపై చేతికర్ర, గోధుమ రంగులో పింక్ రంగు నిలువు, అడ్డం గీతలు ఉన్న కండువా లభించినట్లు తెలిపారు. మృతదేహంపై మెరూన్, నలుపు రంగు డిజైన్‌తో తెల్లని చుక్కలు ఉన్న లుంగీ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించేందుకు అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వగా, ఆయన తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వాహనం ద్వారా మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సీఐ శ్రీ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఆర్‌హెచ్‌సీ కే. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9848114202, 8712558589 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



## దోసపల్లిలో గ్రామదేవతకు నిండు బోనాలతో ఘనంగా పూజలు

దోసపల్లి, సందేశం టైమ్స్ నారాయణఖేడ్ ప్రతినిధి, ఆగస్టు 7: నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం దోసపల్లి గ్రామంలో ఆషాఢ మాసం బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే గ్రామదేవత ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, వేపాకులు, పూలతో అందంగా అలంకరించిన నిండు బోనాలను తలపై మోసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. డోలు, డప్పుల నాదాలు, భక్తి గీతాల మధ్య గ్రామమంతా పండుగ వాతావరణంతో సందడిగా మారింది. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని కుటుంబాల సుఖసంతోషాలు, ఆరోగ్యం, గ్రామ అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, మానూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దత్తు మాట్లాడుతూ గ్రామదేవత ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, యువతతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## దివ్యాంగుల పెన్షన్ పెంపు కోసం రాష్ట్రవ్యాప్తంగా మహా ఉద్యమం: ఎన్‌పీఆర్‌డీ ఇండియా జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్

ములుగు, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, ఆగస్టు 7: దివ్యాంగుల పింఛన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మహా ఉద్యమం నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ ఇండియా) జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ తెలిపారు. లక్ష మంది దివ్యాంగులతో నిర్వహించనున్న ఆత్మగౌరవ బహిరంగ సభకు దివ్యాంగులంతా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ములుగు పట్టణ కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు నక్క చిరంజీవి, సుప్రీం కమిటీ సభ్యుడు అడ్డా రాజులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుడుం రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని ప్రకటించినప్పటికీ రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయకపోవడంపై ప్రశ్నించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న దివ్యాంగుల జీవితాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పింఛన్ పెంపు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనర్హుల పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. తప్పుడు విధానాలతో ఏ ఒక్క దివ్యాంగుడి పింఛన్‌ను తొలగించినా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కొత్తగా రెండు లక్షల మందికి పింఛన్లు ఇస్తామని మంత్రి సీతక్క ప్రకటించడంపై స్పందిస్తూ, గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లక్షా 28 వేల దివ్యాంగుల పింఛన్లను ముందుగా మంజూరు చేయాలని కోరారు. అలాగే మొత్తం సామాజిక పింఛన్లలో పెండింగ్‌లో ఉన్న 11 లక్షల 75 వేల దరఖాస్తుల్లో కొత్తగా రెండు లక్షల పింఛన్లు ఎవరికి ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ ఇండియా ములుగు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మోరే రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేశవ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సదానందంలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

## పాల్వట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం



పాల్వట్ల, సందేశం టైమ్స్ ప్రతినిధి సీహెచ్ బస్వరాజు, ఆగస్టు 7: వట్‌పల్లి మండలం పాల్వట్ల గ్రామంలో లబ్ధిదారుడు ఉదిగారి పారదేశ్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ నలకంటి రాణి మైపాల్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వట్‌పల్లి మండల అధ్యక్షుడు వజనాల విశ్వాస్ ముఖ్య అతిథిగా హాజరై గృహ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద శ్రీనివాస్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ.. రైతుల్లో ఆందోళన



అల్లాదుర్గం, సందేశం టైమ్స్ అల్లాదుర్గం మండల ప్రతినిధి ప్రవీణ్, ఆగస్టు 7: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ఇబ్రహీం తండా సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ఎత్తుకెళ్లడంతో పంటలకు నీటి సరఫరా సమస్యలు ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఘటనపై సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ పనులకు అంతరాయం కలగకుండా వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.



## గద్దర్ ఆశయాలు సమాజానికి స్ఫూర్తి.. అంబేద్కర్ భవన్‌లో ఘన నివాళులు

నారాయణఖేడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 7నారాయణఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో గురువారం ప్రజాకవి గద్దర్ మూడో వర్థంతి సందర్భంగా ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, అంబేద్కర్ భవన్ ఇన్‌చార్జి భీమసేన, బీఎస్పీ నాయకులు అనుముల తుకారం, నారాయణరెడ్డి, సిద్ధు, సామిల్, యేసు తదితరులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గద్దర్ తన పాటలు, రచనలు, ఉద్యమాల ద్వారా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజాకవి, ప్రజాకళాకారుడని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, గద్దర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక చైతన్యం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.